# సూర్య

## కర్నూలు | నంద్యాల

శుక్రవారం | 23 ఫిబ్రవరి 2024 పేజీలు 8


## కుంకనూరులో డెంగ్యూ ఫీవర్



ఆదోనిలో చికిత్స పొందుతున్న చిన్నారి

- తొంగి చూడని అధికారులు

**దేవనకొండ, మేజర్‌న్యూస్ :** మండల ఫరిదిలోని కుంకనూరు గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంగా ఉంటూ కనీస పర్యవేక్షన లేకపోవడంతో గ్రామంలోని యస్‌సి కాలనీకి చెందిన నాలుగేళ్ల అభిరాం,మనోజ్‌కుమార్ అనే ఇద్దరు పసి పిల్లలు డెంగ్యూ బారిన పడినట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడే మురుగు నీరు నిలిచి దోమలు గూడు ఏర్పాటు చేసుకొని ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.గత కొన్ని రోజుల క్రితం నుండి వాటి బారిన పడి మా చిన్నారులకు తీవ్ర జ్వరం రావడంతో గత మూడు రోజులుగా మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి ఆసుపత్రిలో చికిత్సలు చేయిస్తున్నామని వైద్యులు డెంగ్యూ జ్వరమని తెలిపారన్నారు. గ్రామంలో మిగతా 2లో



చంద్రబాబు డోన్ పర్యటనలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుతో ధర్మారం సుబ్బారెడ్డి

### డోన్ సెగ్మెంట్లో

# సైకిల్ సవారీ..



డోన్ టీడీపీ ఇంఛార్జీ ధర్మారం మన్నే సుబ్బారెడ్డి

- కష్టకాలంలో కాడెత్తుకొని..
- కదనానికి సై అంటే సై ...
- దూకుడు పెంచిన ధర్మారం సుబ్బారెడ్డి...
- మలుపులెన్నున్నా గెలుపు తనదేనంటూ ధీమా...
- ప్రత్యర్థి సిద్ధమైతే.. మేము సంసిద్ధం..
- సర్వేల్లోనూ సైకిల్ దే జోరు..

**డోన్, మేజర్ న్యూస్ :** గత ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ఘోర పరాభవం చవి చూసిన టిడిపి పార్టీ పునర్నిర్మాణం దిశగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే బుగ్గన ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్ నియోజకవర్గం పై రెండేళ్ల క్రితమే ప్రత్యేక దృష్టి సారించారు టిడిపి అధినేత చంద్రబాబు. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత డోన్ లో టిడిపి గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొనిందనే చెప్పవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలలో సైతం నియోజకవర్గంలో మిగతా 7లో

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై తాము చేస్తున్న భూకబ్జా ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని, ఈ విషయంపై ఆయనతో ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని తెదేపా పాణ్యం ఇంఛార్జ్ గౌరు చరితరెడ్డి సవాల్ విసిరారు. భూకబ్జాలపై కాటసానితో బహిరంగ చర్చకు తాను ఇప్పటికే అనేకమార్లు సవాల్ చేశానని, ఆయన నుండి స్పందన లేదని ఆమె చెప్పారు. ఇప్పుడూ తాము దానికే కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల రెండు జిల్లాల తెదేపా అధ్యక్షులు బిటి నాయుడు, మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్నూలులో పత్రికా కార్యాలయంపైకి అల్లరి మూకను పంపి దాడి చేయించిన కాటసాని ఆ తర్వాత అమరావతిలో ఇందులో తన పాత్రేమీ లేదని చెప్పుకు రావడం సిగ్గుచేటని, ఆయన చేసిన ప్రకటన శుద్ధ అబద్ధమని ఆమె ఆరోపించారు. కాటసాని భూకబ్జాలపై తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, ఆయన బాధితులు బాధలు చెప్పుకునేందుకు క్యూ కడుతున్నారని ఆమె చెప్పారు. వాస్తవాలను వెల్లడించేందుకు కాటసాని ఇంటికి రమ్మన్నా లేదా ఆయన ఆరాధ్యదైవం యాగంటి ఉమామహేశ్వరస్వామి సన్నిధికి రమ్మన్నా తాము సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. తన కుమారుని పేరు మీద కేవలం 4 ఎకరాల స్థలం మాత్రమే ఉందంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి తన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేసినందుకే అభిమానులు నిరసన వ్యక్తం చేశారని సత్య హరిశ్చంద్రునికి తమ్ముడిలా ఫోజులిస్తున్నారని ఆమె అన్నారు. కాటసాని అరాచకాల మిగతా 2లో



# భూకబ్జాలపై చర్చకు సిద్ధమా?

- కాటసానికి సవాల్ విసిరిన గౌరు చరిత



ఎసిబి వలలో మహేశ్వరి

### అవినీతి మాయలో..

# మహేశ్వరి..!

- ఏసీబీ వలలో మార్కెట్ యార్డు సూపర్‌వైజర్
- రూ.15 వేలు లంచం తీసుకుంటు పట్టుబడిన వైనం
- భయం కనిపించని అ.ని.శా దాడులు
- ఎమ్మిగనూరు ప్రాంతంలో లంచాలు షరా మామూలే
- డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో దాడులు

2లో




# టిడిపిలో టికెట్ వార్

- బొగ్గుల దస్తగిరి దశ దిశ మారేనా..
- నేశపోగు కిరణ్‌మై కిరణం లా దూసుకొచ్చేనా..
- ఆకెపోగు ప్రభాకర్ ప్రభావం తేలేనా...

**కోడుమూరు మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడుతున్న సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టి ఎన్నికలను దృష్టిలో వుంచుకొని నియోజకవర్గం ఇంచార్జీలను ప్రకటించి ఎన్నికలకు మేము సిద్దం అని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. టిడిపి పార్టి రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులను ఇంకా ప్రకటించకపోవడంతో ఆశావాహులు టికెట్‌నాదే ఎవరికివారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు నియోజక వర్గంలో టిడిపి టికెట్‌వార్ తారాస్థాయికి చేరుకొంది. వైసిపి ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్ ,కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తో కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను భూమి పూజలు, శంకుస్థాపనలతోపాటు, వైసిపి నేతలను కార్యకర్తలను కలుస్తూ ఎన్నికల ప్రచారా లను తలదన్నేలా ఉండడంతో తెలుగుదేశం పార్టి నేతలు, కార్యకర్తలు 'రెడ్డోల్ల బండొచ్చే మా బండిరాలే' అన్నచందంగా ఎదురుచూపుల్లో నిమగ్నమయ్యారు. టిడిపిలో టికెట్‌నాదే గెలుపునాదే అని పార్టి కార్యక్రమాలను నిర్వహిస్తుండడంతో నియోజకవర్గంలోని మిగతా 6లో

### అయోమయంలో

# డీఎస్సీ అభ్యర్థులు

సన్నద్ధత ఎలా అని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు - అస్పష్టమైన డీఎస్సీ అంటూ విమర్శలు




**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 ప్రకటన విడుదల చేసింది. కాగా ఎస్జీటీ పోస్టులక బీఈడీ అభ్యర్థులను అనుమతించడంపై న్యాయస్థానం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టుకు కేవలం టీటీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. బీఈడీ అభ్యర్థులకు అనుమతి లేదిన గతంలో తీర్పు వచ్చింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12న విడుదల చేసిన డీఎస్సీ ప్రకటనల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు టీటీసీతోపాటు మిగతా 2లో

సూర్య



# భూకబ్జాలపై చర్చకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

గురించి ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో ఎవరిని అడిగినా చెబుతారని, ఆయన వేధింపులు భరించలేక తెదేపాలో చేరిన వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని, పాలకొల్లు సుధాకర్‌రెడ్డి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని ఆమె చెప్పారు. నిప్పులేనిదే పొగ రాదన్న ఆమె భూకబ్జాలకు పాల్పడకపోతే ఎందుకు బహిరంగ చర్చకు రావడం లేదని ఆమె కాటసానిని నిలదీశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అండ చూసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని గౌరు చరితా రెడ్డి హెచ్చరించారు.



**ప్రభుత్వ ప్రేరే పిత ఉగ్రవాదం నడుస్తోంది : బిటి నాయుడు**

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని కర్నూలు జిల్లా తెదేపా అధ్యక్షుడు బిటి నాయుడు ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో ప్రశ్నించిన వారిని వేధింపులకు గురి చేయడం, అరెస్టులు చేయడం, దాడులు చేయించడం, అడ్డువచ్చిన వారిని హత్య చేయించడం రివాజుగా మారిపోయాయని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎమ్మెల్యేల అరాచకాలను వెలుగులోకి తెస్తున్న పత్రికలపై, పత్రికా కార్యాలయాలపై, విలేకరులపై దాడులు చేయిస్తున్నారని ఆయన చెప్పారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ ఎమ్మెల్యే క ంగాటి శ్రీదేవి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిలు పత్రికలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. మీడియాపై దాడులను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీదేవి, కాటసానిలపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేసులు నమోదు చేయకపోతే ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను ఎదుర్కొనేందుకు సిద్ధంగ ఉండాలని ఆయన అన్నారు.



**అరాచకాలు కాటసానికి కొత్తేమీ కాదు : మల్లెల రాజశేఖర్**

కాటసాని రాంభూపాల్‌రెడ్డికి అరాచకాలు కొత్తేమీ కాదని, ఓర్వకల్లు మండలంలో వెయ్యి ఎకరాల భూములను బినామీ పేర్లతో కబ్జా చేశారని నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆరోపించారు. పత్రిక కార్యాలయాలు, పత్రికా విలేకరులు, ఫోటో గ్రాఫర్లపై దాడులకు పాల్పడుతున్న వారందరినీ గుర్తించి కేసులు నమోదు చేయకపోతే కోర్టులో ప్రైవేట్ కేసులు వేస్తామని ఆయన హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, మాదేసు, సుధాకర్‌రెడ్డి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపిని వీడి బుడ్డా సమక్షంలో టిడిపిలో చేరిక

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, పదవులకు రాజీనామా చేసి మాజి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీపతిరావుపేటకు చెందిన నాయకులు టిడిపిలో చేరారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు సుబ్బరావు, మండల ప్రధాన కార్యదర్శి రమేష్, శ్రీపతిరావుపేట 3వ వార్డు సభ్యులు వెంకటే శ్వర్లుతో పాటు వెంకటేశ్వర్లు, నరేష్, శివ, సంజిరెడ్డి, అరుణ్, కృష్ణలు పార్టీలో చేరగా బుడ్డా కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుడ్డా మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారని, స్వచ్ఛందంగా టిడిపిలో చేరేందుకు వస్తున్నారని అన్నారు. ఒక్కచాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. అభివృద్ధి చేశాము, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించామని గొప్పలు చెప్పుకొనే వైసిపి నాయకులు ఎక్కడ చేశారో, ఏమి చేశారో వారికే తెలియాలని అన్నారు. వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్దిచెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని, 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాజి ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

## సూపర్‌సిక్స్ పథకాలతో
# బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ కాకా రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలతో బాబు షూరిటీ భవిష్యతకు గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరి భరోసా అని తెలుగుదేశం పార్టి యస్.సి.యస్.టి సెల్ రాష్ట్ర కార్యదర్శి గిత్తా జయసూర్య, వీపనగండ్ల తెదేపా సీనియర్ నాయకుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటి కార్యక్రమం ప్రతి కుటుంబానికి వరమన్నారు. బాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ఇంటింటికి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జులు ప్రధాన అంశముగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. రానున్న రెండు నెలల ఎన్నికలలో టిడిపి పార్టికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైసీపీ ప్రభుత్వం సైకో పాలనను అంతమొందించాలని వైసీపీ పాలనలో ఒరిగిందేమి లేదని అవినీతి లేదంటూ, ఇసుక మాఫియాను లిక్కర్ మాఫియాను ముందుకు తీసుకొని వెళుతూ మద్యపాన నిషేదమని మాట ఇచ్చి మడమతిప్పి కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టుకుంటున్నారని ఈ సైకో పాలన అంతమొందించి చంద్రబాబును ముఖ్యమంత్రని చేయాలని, బాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథ్, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ గుండం రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సంపంగి రవీంద్రబాబు, కరుణాకర్, బూడెమద్దిలేటి, మొహిద్దిన్, మైనారిటీనాయకుడు సుభాన్‌భాష, సాంబశివుడు తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తున్న కాకా రమేష్

# విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలి

## – పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** 2014అకాడమిక్ ఇయర్ సంవత్సరం నుంచి ఇప్పటిదాకా డిగ్రీలో ఫెయిల్ అయి సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. కర్నూలు పట్టణంలోని రాయలసీమ యూనివర్సిటీలో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం అకాడమిక్ ఇయర్‌నుంచి డిగ్రీలో ఫెయిల్ అయి సబ్జెక్టులు మిగలిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించలేదన్నారు. జిల్లావ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఒకటి, రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయిన గ్రామీణ ప్రాంతాల్లో కూలీలుగా మారారన్నారు. వెంటనే వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఖండ, రమణ, దామోదర్, వీరేష్, శేషు, సుకుమార్, రఫి పాల్గొన్నారు.

# అవినీతి మాయలో.. మహేశ్వరి..!

**ఎమ్మిగనూరు ప్రతినిధి/ టౌన్, మేజర్‌న్యూస్ :** లంచం..లంచం..లంచం అనే అలవాటు ఎమ్మిగనూర ప్రాంతంలో అధికారులకు వంటబట్టినట్టువుంది. ఇటీవల కాలంలో రెండు రెవెన్యూ కార్యాలయాల్లోనూ అవినీతి చిరు చేపలు పట్టుపడ్డాయి. తిమిగిలాలు ఎగిరిపోయాయి. ఇలాంటిదే మరో సంఘటన గురువారం చోటు చేసుకుంది. అయితే ఈ సారి తహశీల్దార్ కార్యాలయాలు కాదు.. వ్యవసాయ మార్కెట్ యార్డులో దాడులు జరిపారు. అక్కడ పని చేస్తున్న మహిళ ఉద్యోగి ఈ దాడుల్లో పట్టుబడింది. ఇటీవల కాలంలో ఎమ్మిగనూరు తహశల్దార్ కార్యాలయంలో రెండు చిరు చేపలు, గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయంలో ఒక చిరు చేపనే ఎసిబి వలకు పట్టుబడింది. ఇదిమరవక ముందే డబ్బు మాయలో వ్యవసాయ మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ మహేశ్వరి ఎసిబి ఉచ్చుకు చిక్కుకుంది. ఇంత మంది పట్టుబడుతున్న లంచావతారాలు మాత్రం కట్టడి కావడం లేదని ఈ వైనం అద్దం పడుతుంది.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఎసిబి డిఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో వ్యవసాయ మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ మహేశ్వరి రూ. 15 వేలు లంచం తీసుకుంటు పట్టుబడింది. ట్రెడ్ లైసెన్సు కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా రూ. 5200లకు అదనంగా తన చేతులను రూ. 15వేలతో తడపాలని ట్రెడ్ లైసెన్స్ కొరిన బోయ వినయ్ కుమార్‌ను వేదించింది. ఎంత ప్రాదేయపడిన కూడా కనకరించని అధికారిణి పట్ల ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపధ్యంలో ఎసిబి డిజీపీ ఆదేశాల మేరకు డిఎస్పీ వెంకటాద్రి బృందం దాడులు నిర్వహించాల్సి వచ్చిందని విలేఖర్లకు తెలిపారు. ఈ దాడుల్లో బోయ వినోద్ కుమార్ దగ్గర నిబంధనలకు విరుద్దంగా అదనంగా రూ. 15 వేలు లంచంగా తీసుకునట్లు గమనించి మహేశ్వరి దగ్గర సోమ్మును స్వాదీన పరుచుకునట్లు తెలిపారు. లంచం తీసుకుంటు పట్టుబడిన మహేశ్వరిని అదుపులో తీసుకొని విచారిస్తునట్లు తెలిపారు. ఈ అవినీతిలో ముఖ్య కారకుడైన అధికారిపై ఎసిబి ఆరా తీస్తుంది. ఈ దాడుల్లో ఎసిబి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



లంచంగా తీసుకున్న రూ. 15 వేలు

**★ ఉలిక్కి పడ్డ ప్రభుత్వ అధికారులు పారా హుషార్..!**

ఎమ్మిగనూరులో అదికమైన ఎసిబి దాడుల కారణంగా ప్రభుత్వ అధికారులు ఉలిక్కి పడుతున్నారు. పారా హుషార్ అంటూ పరార్ అవుతున్నారు. ముచ్చటగ మూడోసారి మూడు నెలల్లో జరిగిన దాడుల్లో తిమింగలాలు అన్ని దాక్కుంటున్నాయి. చిన్న చేపలు వలలో చిక్కుకుంటున్నాయి. గురువారం ఎసిబి దాడుల వల్ల పట్టణ ప్రధాన కార్యాలయం పురపాలన శాఖ, మండల రెవెన్యూ శాఖా, సబ్-రిజిస్టర్ కార్యాలయంలో కొందరూ అధికారులు మధ్యాహ్నం నుండి అందుబాటులో కనిపించలేదని తెలియవచ్చింది. ఆయా కార్యాలయాల్లో పనులు నిమిత్తం వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

## కుంకనూరులో
# డెంగ్యూ ఫివర్

(మొదటిపేజీ తరువాయి)

మురుగు పేరుకుపోవండతో అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడంలేదని ఆవేధనను వ్యక్తం చేశారు.



గ్రామంలో నిలిచిన మురుగు

# అయోమయంలో డీఎస్సీ అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

బీఈడీ అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొంది. ఈ ప్రకటన ప్రకారం 21వతేదీ వరకు మాత్రమే డీఎస్సీ పరీక్షలకు రుసుం చెల్లించడానికి తుది గడువు విధించారు. దీంతో బీఈడీ అభ్యర్థులు 90శాతం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 20వేల మంది బీఈడీ అభ్యర్థులు, సుమారు 18వేలమంది టీటీసీ అభ్యర్థులున్నారు. ఫీజులు చెల్లించి దరకాస్తు చేసిన తర్వాత అర్హతపై మధ్యంతర ఉత్తర్వులు రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సన్నద్ధత ఎలా?:** డీఎస్సీ పరీక్షలు ప్రకటించిన తేదీల్లోనే జరుగుతాయా లేదా అని అభ్యర్థుల్లో అనుమానాలున్నాయి. ఎస్జీటీ పోస్టులపై అర్హతతోపాటు సిలబస్, రోస్టర్, స్థానికేతర అంశాలపై కూడా కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2018 సిలబస్‌తోనే 2024 డీఎస్సీ నిర్వహిస్తున్నారు. అప్పటి పాఠ్యాంశాలన్నీ మారిపోయాయి. పాత పుస్తులు కూడా లభించడం లేదు. పాఠశాలల్లో కొత్త పుస్తకాలతో బోధన జరుగుతోంది. ఈ తరుణంలో ఐదేళ్ల క్రితం ఉన్న సిలబస్‌తో ఇప్పుడెలా డీఎస్సీ నిర్వహిస్తారని అభ్యర్థులు వాపోతున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కనీసం 45రోజులు సన్నద్ధతకు గడువు ఉండాలన్నారు.

**గడువు పొడిగింపు:** డీఎస్సీ దరఖాస్తు గడువు పొడిగించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 21వతేదీ నుంచి 25వదదేఈ వరకు ఫీజు చెల్లించాలనికి, దరఖాస్తు చేయడానికి పొడిగించారు. పరీక్ష సన్నద్ధతకు కేవలం 20రోజులు మాత్రమే గడువు ఉంది. ఇలాగైతే సన్నద్ధత కష్టమని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నిరుద్యోగ నుంచి ఫీజుల రూపంలో ఖజానా నింపుకోవడానికే అస్పష్టమైన అంశాలతో డీఎస్సీ విడుదల చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.750లు రుసుం నిర్ణయించారు. బీడీఈ అభ్యర్థుల నుంచే రాష్ట్రవ్యాప్తంగా రూ.కోట్లు ఫీజుల రూపంలో వసూలు చేశారు. బీఈడీ అభ్యర్థులను ఎస్జీటీకీ అనుమతిచ్చే అవకాశాలు సన్నగిల్లాయి. వారు చెల్లించిన ఫీజులపై స్పష్టత లేదు.

సూర్య



## సేంద్రీయ ఎరువులు వాడండి ..అధిక దిగుబడులను పొందండి



**వెల్దుర్తి,మేజర్‌న్యూస్ :** సేంద్రియ ఎరువులు జీవన ఎరువులు వాడడం వలన మానవాళికి ముప్పు ఉండదని నవభారత్ ఫర్టిలైజర్ ఎల్ ఎల్ పి ఫీల్ ఆఫీసర్ రామనాయుడు అన్నారు.రసానిక ఎరువులు ఎక్కువగా వాడడం వలన భూసారం తగ్గిపోతుంది పంట దిగుబడులు తగ్గిపోతాయిఅన్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతుంది పేర్కొన్నారు. సేంద్రియ జీవన ఎరువులు వాడడం వల్ల పంట ఖర్చులు తగ్గించుకోవచ్చు అధిక దిగుబడులను సాధించుకోవచ్చునని ఫీల్డ్ ఆఫీసర్ రామానాయుడు తెలిపారు ఆయన ఈరోజు మండలంలోని రాముల్ల కోట పుల్లగుమ్మి నరసాపురం బోయినపల్లి గ్రామాలలో రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి సేంద్రీయ ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడును తీయవచ్చుఅన్నారు. నవభారత్ ఫర్టిలైజర్స్ ఎల్ ఎల్ పి వారు రైతులకు అందించే సేంద్రియ ఎరువులు విజయ గ్రోమిన్, విప్రోమ్5 మరియు జీవన ఎరువులైన విగోల్డ్ మరియు సుప్రీం ఎరువులు వాడి భూమిలో మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మ జీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావలసిన పోషకాలను అందించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి రైతులకు తెలిపారు.నవభారత్ ఫర్టిలైజర్ సంస్థ గత 20 సంవత్సరాల నుండి సేంద్రియ జీవన ఎరువులను అందిస్తున్నారు పలు గ్రామాలలో సేంద్రియ జీవన ఎరువులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రముఖులైన బి.టి రామానాయుడు, ఏ ఆర్ ఎస్ ఎం అయ్యో స్వామి గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## జన ఔషధ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల నాని

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే భారతీయ జన ఔషద కేంద్రాన్ని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల నాని గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన ఔషధ కేంద్రంలో తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందుబాటులో ఉంటాయన్నారు. సర్జికల్ పరికరాలు,సర్జికల్ ఉత్పత్తులు, అత్యంత నాణ్యమైన ఔషధాలు ఈ జన ఔషధ కేంద్రంలో సరసమైన ధరల కు లభిస్తాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆళ్లగడ్డ సహకార పరపతి సంఘం, ఓబులంపల్లి సహకార పరపతి సంఘం చైర్మన్ లు శంకర్ రెడ్డి, నేట్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

## వివాహ కార్యక్రమాలకు హాజరైన రమాకాంత్ రెడ్డి



పెళ్లి కార్యక్రమాలలో నరవ రమాకాంత్ రెడ్డి, సీపీఎం తిక్కన్నలు

**పెద్దకడబూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి గురువారం పెద్దకడబూరు మండలానికి చెందిన గ్రామాలలో పలువురి వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూ వరులను ఆశీర్వదించి పెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న ఈ కార్యక్రమాలకు హాజరయ్యి నూతన జంటలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలకు రమాకాంత్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

## పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శాంతిరాం ఆసుపత్రి నంద్యాల సౌజన్యంతో ఉచితంగా వైద్య శిబిరం సాయిసదన్ ఆడిటోరియంలో పోతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి అద్యక్షతన గురువారంనాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 200మంది పేషెంట్లు పాల్గొనగా వారినీ పరిక్షించి మందులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఈ.వొ.ఆర్డీ శ్రీహరి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు, శాంతిరాం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జిలాన్, డాక్టర్ పవన్, డాక్టర్ అశోక్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ నిర్మల, హ్యామన్ రైట్స్ జిల్లా వర్కింగ్ కమిటీ ఛైర్మెన్ ఎన్. సుబ్బలక్షమ్మ,హ్యామన్ రైట్స్, నంద్యాల జిల్లా బీసీసెల్ ఛైర్మెన్ పి. లక్ష్మన్, హ్యామన్ రైట్స్ లీగల్ సెల్ నెంబర్ కోవెలకుంట్ల ఎం. దస్తగిరి, పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గూటం కంబయ్య, సాయిబాబా, హుసేన్ సభ్యులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

## ఎర్రగుడూరు గ్రామంలో పశు వైద్య శిబిరం



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని ఎర్రగుడూరు గ్రామంలో ఎస్ఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ బత్తుల సంజీవ రాయుడు సహకారంతో ఉచితంగా పశువులకు వ్యాధి నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశు వైద్య అధికారి భాస్కర్ తెలిపారు. అదేవిధంగా ఏపీ మిల్క్ ప్రొసికేటింగ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ మిల్క్ స్టాండర్డ్స్ పై అవగాహన కల్పించినట్లు తెలియజేశారు.

# ఆలూరుకు వెంకట్రామయ్య-గుంతకల్‌కు జయరాం

**అధిష్టానం కూడా గ్రీన్ సిగ్నల్**
**త్వరలోనే అధికారిక ప్రకటన**

**దేవనకొండ, మేజర్ న్యూస్ :** రానున్న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇంకా ఖరారు కానప్పటికీ జిల్లాలోనకబడిన ఆలూరు నియోజకవర్గం నుండి ఆయా పార్టీ అభ్యర్థులు విషయంలో వాడి వేడిగా చర్చోపచర్చలు ఊపందుకున్న సంగతి తెలిసిందే.ఇంత వరకు టిడిపి అభ్యర్థిపై తర్జన భర్జన చేస్తున్న అధిష్టానం వీరభద్ర గౌడ కోట్ల సుజాతమ్మ మధ్య తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.అది కూడ పోలీస్ బాస్ డిఎస్పీ వెంకట్రామయ్యను ఆలూరు బరిలోకి దింపేందుకు ప్రణాలికలు సిద్ధం చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విషయం ఆలూరు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే వైకాపా అధినేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రి గుమ్మనూరు జయరాంను కర్నూలు ఎంపీగా అదేశించి ఆయన స్థానంలో చిప్పగిరి జడ్పీటిసి విరుపాక్షిని ప్రకటించడం జరిగింది. దీంతో జయరాం గత కొన్ని రోజులుగా అధినేతపై గుర్రుగా ఉంటూనే ఎలాగైనా సరే రానున్న ఎన్నికలలో ఆలూరు లేదా గుంతకల్ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే పట్టుదలతో ఇటు కర్నాటక అటు తెలంగాణ నుండి తనకు మద్దతు కూడగట్టుకొని శాయశక్తుల కృషి చేశాడు. అయితే మొదట్లో జయరాంను టిడిపిలో చేర్చుకునే ప్రసక్తే లేదని చెప్పినప్పటికీ ఆయా రాష్ట్రాల నాయకుల బుజ్జగింపుల పర్వంతో ఎట్టకేలకు గుమ్మనూరు జయరాంకు గుంతకల్ టికెట్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.ఇందులో బాగంగానే ఆలూరు అభ్యర్థిని కూడ తనకు అనుకూలమైన వ్యక్తికి ఇస్తే తాను ఇక్కడ కూడ ప్రచారం చేసి గెలిపించుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం.అయితే టిడిపి పెద్దలు కూడ ఆలూరు బరిలో వాల్మీకీ సామాజిక వర్గానికి చెందిన వారినే అయితే బాగుంటుందని అది కూడ గతంలో గుంతకల్ బరిలో నిలిచి ఓడిపోయిన డిఎస్పీ వెంకట్రామయ్యకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.గత కొన్ని రోజులుగా ఆలూరు టిడిపి అభ్యర్థిని ఈ ఎన్నికలలో కూడ మారుస్తున్నట్లు వస్తున్న వార్తలకు దాదాపు ఫుల్‌స్టాప్ పడ్డట్లు తెలుస్తోంది.త్వరలో వెల్లడి కానున్న మూడవ విడతలో వీరి పేర్లను ప్రచురించడం జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.



డిఎస్పీ వెంకట్రామయ్య,



మంత్రి గుమ్మనూరు జయరాం

# వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం..

**సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారుల చెంతకు చేర్చుతున్న వాలంటీర్లు..**
**పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి..**

**వెల్దుర్తి రూరల్ ,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారం చేపట్టి 55 నెలలు పూర్తయి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో స్థానికంగా తమ నివాస ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో శివ శంకరప్ప అధ్యక్షతన ఉత్తమ సేవలను అందించిన వాలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవ వజ్రా పురస్కారాలను ఎమ్మెల్యే శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వాళ్ళింటికి వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామాలలోని ప్రజలకు అండగా నిలిచారని ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరవేయడం వాలంటీర్ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని కొనియాడారు. వాలంటీర్లు సేవల వల్ల ప్రభుత్వానికి ప్రజల్లో మంచి ఆదరణ వస్తుందని దానిని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు హడలెత్తిపోతున్నాయని ఎద్దేవ చేశారు. మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వాలంటీర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి నరసింహులు, మండల కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్ రెడ్డి, జడ్పిటిసి సుంకన్న, సర్పంచ్ శైలజ, పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు, వైకాపా నాయకులు శ్రీరామ్ రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వర్ రెడ్డి, మల్లేపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, బోయినపల్లి నర్సింగ్ అశోక్ కుమార్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి ?నరసాపురం కృష్ణారెడ్డి, కేశవ్, పంచాయతీ కార్యదర్శులు ,సచివాలయాల ఉద్యోగులు,వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సేవ అవార్డులు అందుకుంటున్న ఉత్తమ వాలంటీర్లు

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



**పెద్ద కడుబూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామానికి సమీపంలో వెలసిన శ్రీ పాతూరి అంజినేయ స్వామి దేవాలయం ఆవరణలో గురువారం ఉదయం జరిగిన విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవంఆలయ కమిటీ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా ఉదయం 8 గంటల సమయంలో శివలింగం. నందీశ్వరుడు. మహగణపతి. విగ్రహలకు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు మంత్రోత్చరణలమద్య విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం జరిగింది.అనంతరం మద్యాహ్నం సమయంన భక్తులకు అన్నదానం కార్యక్రమాలు జరిగాయి. రాత్రి 10గంటల సమయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు. పుష్పవతి. లింగన్న. జెల్లిహనుమన్న. మల్కాపురం ఈరన్నతోపాటుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.77.64 లక్షలు



**మహానంది, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన మహానందిలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆలయంలోని అభిషేక మండపంలో నిర్వహించిన ఈ లెక్కింపులో ఉభయ దేవాలయాల్లోని హుండీల ద్వారా రూ.75,97,586 లు రాగా అన్నప్రసాద హుండి ద్వారా రూ.1,27,229లు, గో సంరక్షణ హుండి ద్వారా రూ.39,426లతో కలసి మొత్తంగా రూ.77,64,241ల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఇతర దేశముల కరెన్సీ యుఎస్ఏ డాలర్లు 10, ఆస్ట్రేలియా డాలర్ 1 లభించినట్లు ఆయన తెలిపారు. ఈ మొత్తం 71 రోజుల్లో సమకూరినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి జనార్ధన, ఆలయ ఎఇఓ మధు, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు నాగభూషణం, రంగన్న, సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి, తిరుమల బాలాజీ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సైకిల్ ఎక్కిన తిమ్మనపల్లె వాసులు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని తిమ్మనపల్లె అధికార వైయస్సార్‌సీపీ పార్టీ నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో వేల్పనూరు గ్రామం ఆయన స్వగృహంలో కలిసి ఆయన సమక్షంలో 35 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. పిచ్చనగారి వెంకటేష్, పసుపులేటి రాము, పెద్దమద్దిలేటి, వెంకటేష్, జయకృష్ణ, పిచ్చన్న, శ్రీరాములు తదితరులకు తెదేపా పార్టీ కండువా కప్పి వారిని సాదరముగాపార్టీలోకి ఆహ్వానించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఆత్మకూరు మండల వాసులు పార్టీకీ పదవులకు రాజీనామచేసి టిడిపీలో మండల వ్యవసాయ సలహామండలీ సభ్యుడు సోంపల్లి సుబ్బారావు మండల ప్రధాన కార్యదర్శి ఆవులపాటి రమేష్, శ్రీపతిరావుపేట 3వ వార్డు సభ్యుడు సోంపల్లివెంకటేశ్వర్లు విరితో పాటు నరేష్, శివశంకర్, సంజీరెడ్డి, వెంకటేశ్వర్లు , అరుణ్, కృష్ణ వీరికి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సూర్య



# జగనన్న గుండెల్లో వాలంటీర్లకు సముచిత స్థానం



వాలంటీర్లకు సన్మానం చేసిన ఎమ్మెల్యే

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు అందిస్తున్న వాలంటీర్లు జగనన్న గుండెల్లో వాలంటీర్లకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు.గురువారం చాగలమర్రి పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ఆదర్శనీయమన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికి మాత్రమే అందేవన్నారు. పేదలకు మొండి చేయి చూపే వారన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హత ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు.కరోనాసమయంలో వాలంటీర్లు అందించిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు.వాలంటీర్లు పడుతున్న కష్టానికి జగనన్న ఈ ఏడాది 50శాతం నగదు పెంచారన్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకుల చరిత్ర రాష్ట ప్రజలకు తెలుసన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ తులసమ్మ, ఎంపిపి వీరభద్రుడు,జడ్పిటిసి లక్ష్మిదేవి,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్, పత్తి నారాయణ,రాష్ట్ర సేవాదల్ కార్యదర్శి రమణ,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్‌లు గోవిందయ్య,ప్రతాప్ రెడ్డి,బంగారు షరీఫ్,మౌళిబాష, ఎంపిటీసిలు పత్తి నారాయణ,లక్ష్మిరెడ్డి,నరసింహులు, వెంకటరాముడు,ఫయాజ్,వైసిపి నాయకులు మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వెంకటసుబ్బారెడ్డి,కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం,శేషురమేష్,గేట్ల మాబు, ఖాదర్‌బాష,రాముడు, మల్లారెడ్డి,రమణారెడ్డి,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్.. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

**చెక్కులు మంజూరైన 6 మందికి రూ.10లక్షల 75 వేల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**



**వెల్దుర్తి,మేజర్‌న్యూస్ :** పత్తికొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాలలోని రోడ్డు ప్రమాదం, కరెంటు షాక్ తో మృతిచెందిన మరియు సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గురువారం బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆరోగ్యశ్రీ క్రింద లేనటువంటి చికిత్సలు అన్నింటికీ కూడా సీఎంఆర్ఎఫ్ క్రింద దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరెంట్ షాక్ తో మృతి చెందిన బాపనదొడ్డి బోయ శేషాద్రి సతీమణి పార్వతికి– రూ. 2లక్షలు,వినాయక నిమజ్జనం రోజు చెరువులో పడి అకస్మాత్తుగా మృతి చెందిన కృష్ణాపురం గొల్లరాజు తల్లి నాగమ్మకు –రూ. 2లక్షలు,మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందిన కోయిలకొండ వైఎస్ఆర్ పార్టీ కార్యకర్త మాదిగ చిన్నరంగడు సతీమణి మాదిగ వెంకటలక్ష్మికు రూ. 3లక్షలు,డోన్ హైవేలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన బొంతిరాళ్ల హరిజన రంగస్వామి సతీమణి హరిజన రాధ కు – రూ. 2లక్షలు, పత్తికొండ షఫీకు–రూ.90వేలు ,అన్సర్ మహబూబ్ బాషాకు –రూ. 85,వేల చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి అందించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యేకి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ,వెల్దుర్తి, క్రిష్ణగిరి, మద్దికేర మండలాల వైఎస్ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మన దేశం.. మన గొప్పతనం వేడుకలు




**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్లలో ఉన్నటు వంటి జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం 'మన దేశం మన గొప్పతనం"వేడుకలు పాఠశాల కరెస్పాండెంట్ గంగాధర్ రెడ్డి అధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు 60 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరెస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు తయారు చేసిన చారిత్రక కట్టడాలను వీక్షించారు. వివిధ రాష్ట్రాల వేషాధారణలో ఉన్న విద్యార్థులను వారి యొక్క రాష్ట్రాల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ గంధధార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం యొక్క గొప్పతనం గురించి ఆచార వ్యవహారాలు గురించి విద్యార్థులకు వివరించారు భారతదేశం గొప్ప దేశంగా నేడు ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయి. అంటే దానికి భారతదేశంలో ఉన్న వివిధ వర్గాల ప్రజలే కారణం అని అలాగే



నాడు నాయకులు కలలుకన్న భారతదేశ అభివృద్ధిలో విద్యార్థులు కూడా భాగం కావాలని సూచించారు.ఈకార్యక్రమంలో కరెస్పాండెంట్ గంగాధర్ రెడ్డి, డీన్ సతీష్ చంద్ర, ప్రిన్సిపాల్ ముల్లా జైబ భక్తియ, శ్రీనివాసులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్నికలపై గ్రామాలలో ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆళ్ళగడ్డ డిఎస్పి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఆళ్ళగడ్డ డిఎస్పి షేక్ షర్ఫుద్దీన్ తెలియజేసారు.చాగలమర్రి పోలీస్ స్టేషన్ ను ఆయన గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు.స్టేషన్ కు విచ్చేసిన డిఎస్పికి ఎంపిపి వీరభద్రుడు,ఉప సర్పంచ్ సోహెల్,వైసీపీ నాయకులు చక్రం బీడీ షబ్బీర్,తదితరులు పూలమాలలు,శాలువలతో సత్కరించారు.అనంతరం డిఎస్పి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ పరధిలో 34 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు.ఆయా గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు ఎన్నికలకు ముందుగానే గ్రామాలలో రౌడిషీటర్లను,అనుమానితులను బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు.ఎన్నికల మోడల్ ఆప్ కోడ్ కండక్ట్ పై పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.కార్యక్రమం లో ఎస్ఐ రమణయ్య పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యలు ప్రారంభమైన పట్టించుకోని ఎమ్మెల్యే



భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పర్యటిస్తున్న భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వైకాపా రాక్షస పాలన కొనసాగుతున్నదని మాజీమంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు.. గురువారం పట్టణంలోని పాత బస్టాండు, బిబిఆర్ కాంప్లెక్స్, ఎస్.వి ప్యాలస్ వీధి అలాగే సాయంత్రం పట్టణంలోని ఆశ్రమం వీధి, గంగమ్మ గుడి వీధి లలో బాబు షూరిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగాతెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి ఇంటింటికి తిరుగుతూ అఖిల ప్రియ కరపత్రములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం వీధిలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆళ్లగడ్డకు వచ్చి16 నెలలు గడుస్తున్న హామీ ఇచ్చిన 100 కోట్లను ఎమ్మెల్యే ఇంతవరకు తీసుకొని రాలేకపోయారన్నారు. తాను ఆళ్లగడ్డకు తెచ్చిన 180 కోట్లు విలువైన తాగునీటి పథకాలను ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. ఈ పనుల్లో కమిషన్ రాదని వాటిని అర్ధాంతరంగా ఆపేశారన్నారు. ఎమ్మెల్యేకు కమిషన్ల పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. త్రాగునీటి సమస్య ముంచుకొస్తున్న ఎమ్మెల్యే నుంచి కనీస స్పందన లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రతి సంవత్సరము 5000 మంది యువతకు ఉపాధి చూపించే పరిశ్రమలను తెస్తామన్నారు.అందువల్ల ప్రజలు కూడా ఒక్కసారి ఆలోచన చేసి టిడిపికి పట్టం కట్టాలన్నారు.. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, నన్నే బాయ్ గారి జిలాని, మాజీ కౌన్సిలర్లు రమీజా, సలాం, ఆళ్ల నాగ శ్రీనివాసులు, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, శంకరయ్య, శేఖర్ రెడ్డి,గుండామని, బందారు శివ యాదవ్, భాస్కర్ యాదవ్, రామాచారి పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసిన ఎంపిడిఓ



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పేద, మధ్యతరగతి ప్రజలపై వైద్య ఖర్చుల భారం పడకుండా సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రచార కార్యక్రమంతో పాటు కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల గురువారం పంపిణీ చేశారు. ఈ పథకం కింద వైద్యఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీడీవో సరస్వతి పంపిణీ విధానాన్ని పరిశీలించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కర్నూలు వాసికి డాక్టరేట్ లభ్యం



డాక్టరేట్ అందుకుంటున్న కొత్త కాప గౌతమి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :**

కర్నూలు నగరానికి చెందిన జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.శేషాద్రిరెడ్డి కుమార్తె కొత్త కాపా గౌతమికి డాక్టరేట్ లభించింది. ఆర్థిక శాస్త్రంలో ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ అండ్ ఇండస్ట్రీయల్ జయిజేషన్‌లో ఎంపీరి కల స్టడీస్ అనే టాపిక్‌లో ఆమెకు డాక్టరేట్ దక్కింది. తిరుపతిలో జరిగిన స్నాతకోత్సవంలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు.

# బొగ్గులైన్ వాసులకు ఎటువంటి పునరావాసం కల్పించలేదు



ప్రజలతో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల బొగ్గులైన్ ప్రాంతంలో ఎన్ఎండి ఫిరోజ్ చాయ్‌పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి అధికారంలో ఉన్న శిల్పా కుటుంబం బొగ్గులైన్ ప్రాంత ప్రజలకు ఎటువంటి పునరావాసం కల్పించకుండా వారికి ఇళ్ళ పట్టాలిచ్చి ఇళ్లు కట్టుకొనేందుకు సహాయం చేయలేదన్నారు. వైసీపీ నాయకుల వ్యాపార సముదాయాలకు ఆసుపత్రులకు పెద్దపెద్ద రోడ్లు వేయాలని ఈ బొగ్గులైన్‌కు చెందిన వెనుకబడిన తరగతుల ప్రజల పూరి గుడిసెలను తొలగించేందుకు రాత్రికి రాత్రి కరెంటు కట్‌చేసి పెద్దపెద్ద బుల్‌డోజర్లు తెచ్చి పూరి గుడిసెలను ధ్వంసం చేయాలనుకున్నారు. ఈదౌర్జన్యాన్ని ప్రజలకు తోడుగా తెలుగుదేశం పార్టీ నిరసన తెలిపి వ్యతిరేకించడంతో వైసీపీ నాయకులు వెనుదిరిగారన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా వీరి ఓట్లు పొందాలని కుందూనది వద్దున పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుని మళ్లీ గుడిసెలను కూల్చాలని చూస్తున్నారని అన్నారు. రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో బొగ్గులైన్ ప్రజలకు శాశ్వత గృహాలను కట్టించి వారికి పునరావాసం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఈనెల 25న గ్రూప్2 పరీక్షలు

**మంత్రాలయం,మేజరున్యూస్:** ఈనెల 25వ తేదీన మంత్రాలయంలోని పరిమళ విద్యానికేతన్, ప్రభుత్వ జూనియర్ కాలేజి, శ్రీరాఘవేంద్రడిగ్రికాలేజిలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్2 పరీక్షలు నిర్వహించబడనున్నాయి.ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయబడింది. ఈ కారణంగా మంత్రాలయం తహశీల్దార్ శ్రీధరమూర్తి మాట్లాడుతూ ఊరేగింపులు, చట్టవిరుద్ధమైన సమావేశాలు నిర్వహించరాదని ఆయన తెలిపారు. ఈ సదర్భంగా పరీక్షా కేంద్రానికి వంద మీటర్ల దూరంలో మారణాయుధాలను, కర్రలు, ఇటుకలు, రాళ్ళు, బ్యాట్లు పట్టుకొని తిరుగటం నిషేధమని ఆయన తెలిపారు. ఈఉత్తర్వులు వివాహ వేడుకల ఊరేగింపుకు మాత్రం మినహాయించినట్లు తహశీల్దార్ వివరించారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



**వెల్దుర్తి రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసిన పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులు అడిగితెలుసుకున్నారు.సక్రమంగా పెడుతున్నారని విద్యార్థినీలతో సమాచారం రావడంతో ఆమె సంతోషించారు. మరియు ప్రక్కనని నాడు నేడు పథకం కింద అదనపు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతిలో మంచి మార్కులతో చెరుకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు.

## ఉమ్రా యాత్ర విజయవంతం కావాలి –బీసీ రాజారెడ్డి


సాహేబ్‌ను సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణ ఖాజీ సాహేబ్ దస్తగిరిస్వామి దర్గా పీఠాధిపతి ఖాజీ సయ్యద్ ముఫ్తీ అబ్దుల్ సాహేబ్ వెలుతున్న ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి కావాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. నేటి నుంచి 25రోజులపాటు దైవప్రార్థన నిమిత్తం ఉమ్రా, మక్కా, బాగ్దాద్ వెలుతున్న శుభసందర్భంగా అబ్దుల్లా సాహేబ్‌ను బుధవారం రాత్రి బీసీ రాజారెడ్డి కలిసి హార్థిక శుభాకాక్షంలు తెలిపారు. ముందుగా హజ్రరత్ మహబూబ్ సుబాహాని దర్గాలో బీసీ రాజారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫాతేహాలు సమర్పించారు. అనంతరం సాహేబ్‌తో ఆత్మీయ సమావేశమై చేయబోతున్న యాత్రల వివరాలను అడిగి తెలుసుకొని పూలమాల వేసి శాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

**– టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి**


మాట్లాడుతున్న కోట్ల

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పగిడిరాయి గ్రామంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి నారాయణరెడ్డి, వైవి.ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, యాగంటయ్య, ఎర్ర మీసాల సుంకయ్య, బేతపల్లి లాలప్ప, డీలర్ సుంకన్న పాల్గొన్నారు.

## వైసీపీ పత్రిక స్వేచ్ఛను హరిస్తుంది..


డోన్ టీడీపీ ఇంచార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి

**డోన్ ,మేజర్‌న్యూస్ :** వైసీపీ నాయకులు బరితెగించి పత్రికలు, మీడియా రంగం పై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గు చేటని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని డోన్ టీడీపీ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆమేరకు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ క్రిష్ణ పై, ఈనాడు కార్యాలయం పై వైసీపీ వరుస దాడులతో బయటపెట్టి మరోసారి తిరిగి అధికారం చేపట్టాలనే దురుద్దేశంతో దాడులు చేస్తున్నారని, ఇది వారి ప్రణాళికలో ఒక భాగమే అని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వారి పార్టీ నాయకులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు.ఈ దాడులను చేస్తున్న వైసిపి గూండాలను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనీ అన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విఘతమే నని ,పత్రిక, మీడియా స్వేచ్ఛను వైసిపి ప్రభుత్వం హరిస్తూ... ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తుందని అన్నారు. వైసీపీ తాటాకు చప్పట్లుకు భయపడే ప్రసక్తే లేదని , పోలీస్ అధికారులు దాడులు చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని. మరల ఇటువంటి వి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం వర్ధంతి


నివాళులు అర్పిస్తున్న డాక్టర్ కాకరవాడ

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** నందికోట్కూరు పట్టణంలోని స్వతంత్ర సమరయోధులు దేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 64వ వర్ధంతి వేడుకలు నందికొట్కూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ కాకారవాడ చిన్న వెంకటస్వామి మైనారిటీ నాయకులు సుల్తాన్ ఖాద్రి, తెలుగు యువత నాయకులు బాబు నరేష్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మౌలానా అబ్దుల్‌కలాం స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి విద్యాశాఖామంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రి వర్గంలో సేవలు అందించాడు. అబ్దుల్ కలాం ఫిబ్రవరి 22 1958లో మరణించాడు. మరణాంతరం భారతదేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇచ్చి గౌరవించింది. అతను దాదాపుగా మూడు భాషలలో విద్యను భోధించేవాడని ఇతర దేశాల నుండి గణితం, రేఖ గణితం, తత్వ శాస్త్రాలలో స్వీయ అధ్యాయం చేసి అంతేకాకుండా ప్రపంచ చరిత్ర రాజకీయాలను నేర్చుకున్నారని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాలు చేపట్టారని తెలిపారు.ఆయన విద్యారంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రహమాన్, ఖాద్రి పాల్గొన్నారు.

## నలుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** కడప, నంద్యాల జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బందిపై గతంలో ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్.విజయరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లాకు చెందిన సీఐ శేషయ్య, నంద్యాల ఎస్ఐ బి.నాగరాజు, కడప హెడ్‌కానిస్టేబుల్ టి.బాలదస్తగిరి, కడప ఆఫీసు సూపరింటెండెంట్ ఎన్‌టి.ప్రశాంతి ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటున్నామన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు.

## ఆళ్లగడ్డలో నేటి నుండి బిజెపి ప్రజాపోరు..

**ఎమ్మెల్యే గారూ.. త్రాగునీటిపై రాజకీయం వద్దు..**


మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో నేటి నుండి ప్రజాపోరుకార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని త్రాగునీటి పై ఎమ్మెల్యే రాజకీయం చేయడం తగదని ఆళ్లగడ్డ తాలూకా బిజెపి భాధ్యులు భూమాకిషోర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేసవి ప్రారంభమైందని ఆళ్లగడ్డ పట్టణంలో త్రాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయ న్నారు. పట్టణంలోని ఎల్ ఏం కాంపౌండ్, సత్రం వీధిలో త్రాగునీటి సమస్య తలెత్తి నదని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని భూమా కిషోర్ రెడ్డి ఆరోపించారు. తాగునీటి కష్టాలు వేసవిలో మొదలవుతాయని అందరికీ ముందు నుండి తెలుసని అధికారులు ఎందుకు దానిపై శ్రద్ధ చూపలేదని విమర్శించారు.అసలు గండ్లేరు నుండి తాగునీరు వస్తుందా అని ఆయనప్రశ్నించారు. మండలంలోని గ్రామాల్లో జలసిరి పథకం చేసుకున్న వారికి ఎమ్మెల్యే లెటర్ ఉంటేనే బోరు వేస్తామని అధికారులు అంటున్నారన్నారు. నీటి విషయంలో ఎమ్మెల్యే రాజకీయం చేయడంతగదన్నారు. నీటి సమస్యపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలనుకుంటున్నామన్నారు. నేటి నుండి బిజెపి ప్రజాపోరులో భాగంగా ప్రతి గడప తిరుగుతామని, వైకాపా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని,తనకు ఒకసారి అవకాశం ఇస్తే చేసే మంచి గురించి ప్రజలకు చెప్తానన్నారు. నిజాలు నిర్భయంగా రాసే విలేకరులపై దాడులు చేయడం తగదని, అటువంటివారిని తరిమికొట్టాలని పోలీసులు మీడియాపై దాడి చేసిన వారిపై అడ్వెంచర్లు తీసుకోవాలని భూమా కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మిడ్తూరులో వాలంటీర్లకు వందనం కార్యక్రమం



**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాలంటీరు వందనం కార్యక్రమాన్ని ఎంపీడీవో గంగావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందికోట్కూరు నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ ధారా సుధీర్ పాల్గొని సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రలకు ప్రశంసా పత్రాలను, మెడల్స్, నగదు పురస్కారాలు అందించి దుశ్శాలువాతో వాలంటీర్లను సత్కరించారు. అర్హులైన వాలంటీర్లకు వజ్రసేవా, రత్నసేవా, సేవామిత్ర పురస్కారాలతో పాటు 30వేల నగదు పురస్కారాలను ఇచ్చారు. మిడ్తూరు సచివాలయం -2 కు చెందిన మిద్దెపోగుల సుబ్బన్నకు 45 వేల రూపాయల నగదును బహుమతి అందజేస్తూ దుశ్శాలువాతో సత్కరించారు. అంతేకాకుండా చెరకుచెర్ల గ్రామానికి చెందిన గ్రామ పంచాయితీ రాజశేఖర్, చౌట్కూరు సచివాలయానికి చెందిన రేణుకమ్మ, జలకనూరు శివరంజని, మిడ్తూరు రెండవ సచివాలయం బోయ శివకృష్ణ, నాగలూటి గ్రామ సచివాలయానికి చెందిన వరలక్ష్మికి సేవారత్నలతో పాటు దుశ్శాలువాతో పాటు 30 వేల నగదును అందజేశారు. అనంతరం నందికొట్కూర్ నియోజకవర్గపు సమన్వయకర్త డాక్టర్ సుధీర్ ధారా మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల ఇండ్ల వద్దకే పథకాలను చేర్చాలనే ఉద్దేశ్యంతో వాలంటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అవినీతి పాలన లేకుండా ఒక్కొక్క వాలంటీరు 50 కుటుంబాలను ఎన్నుకొని వారి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు ఇస్తున్న ఘణత సిఎం జగన్‌కె చెందిందని గత టిడిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందలంటే జన్మభూమి కమిటీల ద్వారా ఏర్పరచుకొని ఇచ్చేవారని వారికి సంబంధించిన వారికి మాత్రమే పథకాలు అందేవని అలా కాకుండా ఈ ప్రభుత్వంలో సామాన్య ప్రజలందరికి ప్రతిపక్షంలో ఉన్నవారికి కూడా అందజేసిన ఘనత జగనన్నది అని ఈ వాలంటీర్లదే అని ఈ నేపథ్యంలోనే ప్రజలకు వాలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వాలంటీర్ల వందనం పేరుతో వాలంటీర్లకు ప్రభుత్వం సత్కరిస్తుంది. అందుకే మళ్లీ జగనన్నకే పట్టం కట్టాలని వైసీపీ ఓటు వేసి గెలిపించాలని డాక్టర్ సుధీర్‌ధారా కోరారు. అనంతరం వైసీపీ మండల కన్వీనర్ ఏర్పాటు చేసిన విందులో డాక్టర్ సుధీర్‌ధారా వైసీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మెన్ దువ్వాడ శివరామకృష్ణారెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ లోకేశ్వరరడ్డి, యంపీపీ మల్లువెంకటేశ్వరెమ్మ, మిడ్తూరు సర్పంచ్ జయలక్ష్మమ్మ వైస్‌ఎంపీపీ నబిరసూల్, ఐటివింగ్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి, జేసియస్ మండల కన్వీనర్ రవి కుమార్, కోఆప్షన్ సభ్యుడు మౌలా సర్పంచులు చంద్రశేఖర్‌రెడ్డి, జీవరత్నం, ఫణిభూషన్‌రెడ్డి, స్వామిరెడ్డి, తిమ్మారెడ్డి,ఎంపీటీసీ హరిసర్వోత్తంరెడ్డి, వైసీపీ నాయకులు రామనాగేశ్వర రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, చిన్నఅయ్యన్న, తదితర వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నంద్యాల ప్రజలకు రక్షకుడిని అవుతా..

- రాష్ట్రానికి జగన్..నంద్యాలకు శిల్పా చేటు..
- కేంద్ర నిధులతో నంద్యాలను అభివృద్ధి చేస్తా
- ప్రజాపోరు యాత్రలో శిల్పా పై ధ్వజం
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు


ర్యాలీలో మాట్లాడుతున్న అభిరుచి మధు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రానున్న ఎన్నికల్లో నంద్యాల ప్రజలు అవకాశం కల్పిస్తే రక్షకుడిని అవుతానని నంద్యాల బిజెపి కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. రాష్ట్రాన్ని వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలను పట్టిపీడిస్తుండగా.. మరో వైపు నంద్యాలలో శిల్పా కుటుంబం ప్రజలను పట్టిపీడిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశాంతమైన నంద్యాలలో ప్రజలను, వర్గాలకు రెచ్చగొట్టే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రజాపోరు యాత్రలో నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు శిల్పా కుటుంబంపై విరుచుకుపడ్డారు. గురువారం ప్రజాపోరు యాత్రలో భాగంగా ఆత్మకూరు బస్టాండ్ మీదుగా గాంధీచౌక్ వద్దకు చేరుకుని బిజెపి శ్రేణులతో కలిసి బీజేపీ చేపట్టిన పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన నంద్యాలలో ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేసే తరిమి కొట్టడానికి అభిరుచి మధు ఉన్నారని శిల్పా ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. నా వెనుక బిజెపి ఉందని గుర్తుపెట్టుకోవాలన్నారు. బ్రిటీష్ మాదిరిగా వ్యాపారం కోసం వచ్చి రాజకీయంగా ఆదరిస్తే ఇండియా–పాకిస్తాన్, మగాడు, మొగోడు లేరని శిల్పా మోహన్‌రెడ్డి, శిల్పా రవి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. నంద్యాల ప్రజలకు సేవ చేస్తానని వచ్చి చివరికి భక్షకుడిగా మారారని దుయ్యబట్టారు. శిల్పా కుటుంబం దుష్టపాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. వారి మాట వినని వారిపై పోలీసులతో కేసులు పెట్టిస్తారన్నారు. ప్రజలు అరాచకాలు, అన్యాయాలు తెలుసుకుని ఓటు అనే ఆయుధంతో సమాధి కట్టడానికి సిద్ధమయ్యారని అన్నారు. మాట వినని కౌన్సిలర్స్‌పైనే కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారని అన్నారు. శిల్పా కుటుంబం దురాగతాలు తెలియని వ్యక్తులు నంద్యాలలో లేరన్నారు. మున్సిపాలిటీలో జీతం..ఇంట్లో పనిచేయించుకోవడం సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. వారి బెదిరింపులకు భయపడే ప్రజలు లేరన్నారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, అవినీతి, అక్రమాలు, దురాగతాలు రాష్ట్రానికి జగన్ ప్రమాదకరంగా మారాడని అన్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక భాగమే అని అథోగతిపాలు చేసిన రాష్ట్రాన్ని ఆదుకొనేందుకు బీజేపీ ప్రజాపోరు యాత్రను నిర్వహిస్తున్నామని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆంధ్రులు సిగ్గుపడే పరిస్థితి తీసుకుని వచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీకి అవకాశం ఇస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. దేశం, రాష్ట్రం, నంద్యాల అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. ఆయన వెంట క శెట్టిచంద్ర, రమేష్, స్వామి, తాడి రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు

### ఈనెల 25 న నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు..

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదీన టెక్కె లోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఓపెన్ కాటగెరీ లో నిర్వహిస్తునట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్.జి.రవికృష్ణ,ప్రధాన కార్యదర్శిజి.రామ సుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ లు నెరవాటి ఆనంద్ గుప్తా, నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్. నెరవాటి కృష్ణ సాయి రోహిత్ తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చూపించిన వారికి ప్రముఖ ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎస్ రాజశేఖర్ రెడ్డి సౌజన్యంతో 22 వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపికలు అందచేయడం జరుగుతుందన్నారు. ఈనెల 24 వ తేదీ లోపు ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9010451585 సంప్రదించాలని తెలిపారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## వారంరోజుల్లోపు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

### – జిల్లా కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** వారం రోజుల్లోపు వల్నరబిలిటీ, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.సృజన సెక్టార్ అధికారులను, సెక్టార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వల్నరబిలిటీ మ్యాపింగ్ అంశంపై సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు కలెక్టర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మూడు రోజుల్లో వల్నరబిలిటీ మ్యాపింగ్‌కు సంబంధించిన వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈ ఎక్సరైజ్ చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ అధికారులు అందించే నివేదిక ప్రకారం భద్రత ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని, కావునా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్‌యూనిట్–3స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌మురళి, 4యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామునాయక్, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకోవాలి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ఆత్మరక్షణ కోసం విద్యార్థిని, విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవాలని సెయింట్ క్లారెట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ హృదయస్వామి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని, విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హృదయస్వామి మాట్లాడుతూ చదువు తోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఇప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ మాస్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.



బెల్టులు అందజేస్తున్న దృశ్యం

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

### – ఎమ్మెల్యే చేతులు మీదుగా చెక్కు పంపిణీ



బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగరెడ్డి

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ముగులదొడ్డి గ్రామానికి చెందిన కురువ బంగి సిద్ద, నర్మద అనే దంపతులకు చెందిన ఆదిక్ అనే చిన్నారికి సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు కావడం జరిగింది. మంజూరైన చెక్కును ఎమ్మెల్యే బాలనాగరెడ్డి చేతులు మీదుగా చెక్కు పంపిణీచేశారు. ఆదిక్ అనే చిన్నారికి పుట్టుకతోనే మతస్థితిమితంలేక చికిత్సకోసం తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సహకారంతో మురళీరెడ్డి దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. ఆయన స్పందించి ఎమ్మెల్యే బాలనాగరెడ్డి సమాచారం ఇవ్వడంతో సిఎం రిలీఫ్‌ఫండ్ కింద లక్ష రూపాయలను చికిత్స నిమిత్తం మంజూరు చేశారన్నారు. లక్షరూపయాలు మంజూరు కావడంతో హర్షం వ్యక్తంచేసి బాలనాగరెడ్డి, ధరణీధర్‌రెడ్డి, మురళీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సోమేష్, ఆంజినేయ, ఉసేని, ఈరన్న, అగసనూరు ఎంపిటిసి ప్రహ్లద పాల్గొన్నారు.

## కనులపండుగగా ధ్వజస్తంభ, దేవతామూర్తుల ప్రతిష్టాపన

★ ముగతి గ్రామంలో పండుగ వాతావరణం

★ రామలింగేశ్వరుడు, సీతారాములను దర్శించుకున్న ప్రముఖులు

**నందవరం, మేజర్‌న్యూస్ (ఎమ్మిగనూరు ప్రతినిధి) :** నందవరం మండలం ముగతి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శ్రీ రామలింగేశ్వర స్వామి, సీతా సమేత శ్రీరామచంద్రుని విగ్రహాలతో పాటు నవగ్రహాల ప్రతిష్టాపణ తో పాటు ఆలయాల ముందు ద్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాలతో గ్రామం అంతా పండుగ



ద్వజస్థంభంకు పూజలు చేస్తున్న ఆడపడుచులు



పూజల్లో పాల్గొన్న ఎర్రకోట, బుట్టా

వాతావరణం నెలకుంది.. గురువారం జరిగిన ఈవిగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో బాగంగా గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపిపి లక్ష్మిదేవమ్మ ఆద్వర్యంలో విశిష్ట పూజలు చేపట్టారు.. జలాదివాసంలో ఉన్న విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేపట్టి రుద్రాభిషేకం, అభిషేకం, కుంకుమార్చన, నవగ్రహ పూజలతో ద్వజస్థంభ, కలస పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు శాసనసభ్యులు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైకాపా సమన్వయకర్త బుట్టారేణుక, పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి కెర్ లక్ష్మికాంత రెడ్డి, మండల పార్టీ కన్వినర్ శివారెడ్డిగౌడు, మాజీ జెడ్‌పిటిసి ఈరన్నగౌడు, తదితరులు పూజల్లో పాల్గొన్నారు వీరిని ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి ఘనంగా సత్కరించారు.

## వాలంటీర్ల సేవలు అసమానం

### – కుడా ఛైర్మెన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** సీఎం జగన్ అమలు చేస్తున్న వాంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, వాలంటీర్ల సేవలు అసమానమని వైసీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపీపీ వెంకటేశ్వ రమ్మ అధ్యక్షత నిర్వహించారు. 372మంది వాలంటర్లీను సన్మానించి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఇంటింటికి అందజేయడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం వాలంటీర్లకు గతం కంటే ప్రోత్సాహకాలను పెంచిందన్నారు. వాలంటీర్లను సేవా వజ్ర, సేవారత్నం, సేవా మిత్ర అవార్డులతో సన్మానించడం సంతోష కరమన్నారు. పేదవారి గుండెల్లో గుడి కట్టుకున్న సీఎం జగన్ అన్నారు. ఈ



వాలంటీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్‌నాయుడు, జడ్పీ టీసీ ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నేహమియా, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీటీసీ రామనాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు పంచ లింగాల వెంక టేశ్వరరెడ్డి, సింగవరం వెంకటేశ్వరరెడ్డి, ఉల్చాల వాసు, సంపత్ కుమార్, నిడ్జూరు ప్రసాద్, నిడ్జూరు సంతప్‌కుమార్, పడిదంపాడు వెంకటేశ్వర్లు, తాండ్రపాడు చిన్నలక్ష్మన్న, సురేష్, మిలటరీ కాలనీ వెంకటేశ్వర్లు, పుదూరు మహేష్, ఆదాం, భాస్కర్, శివరామపురం శివనన, అనుకు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కాలం చెల్లింది...

### రైతుల వ్యతిరేక ప్రభుత్వం – కాంగ్రెస్ ఇంఛార్జీ

**ఆదోనిరూరల్, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు కాలం చెల్లిందని, బిజెపి రైతులకు వ్యతిరేక ప్రభుత్వమని కాంగ్రెస్ ఇంచార్జీ నీలకంఠప్ప పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో వైసీపీ ఉక్కిరి బిక్కిరి పరిపాలన కొనసాగుతుందన్నారు. రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం చెందిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు వైసీపీ పాలనశాపంగా మారిందన్నారు. గతంలో రైతు ఉద్యమంలో రైతులను కారుతో తొక్కించడం, నేడు బిజెపి పరిపాలనలో బుల్లేట్ గాయాలతో యువ రైతు మృతి చెందడం శోచనీయమన్నారు. ఇటీవల విడుదల చేసిన డిఎస్సీ నోటిఫికేషన్‌లో అవకతవకలు ఉన్నాయన్నారు. నిరుద్యోగులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ విజయవాడలో సెక్రటరేట్ వద్ద డిఎస్సీ వద్దు, మెగా డిఎస్సీ కావాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా నిరసన కారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమాంజసమన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలిని, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. 2024 ఎన్నికల్లో నిరుద్యోగులు, యువకులు,రైతులు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, జిల్లా ఉపాధ్యక్షులు దీలిప్, పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్, ఐఎన్‌టీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు జయరాం, నాయకులు రామన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలో టికెట్ వార్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నేతలు,కార్యకర్తలు తీరని అయోమయానికి గురవుతున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించి పార్టీలో టికెట్‌వార్‌కు ముగింపు పలకాలని ఎదురుచూస్తున్నారు.

**బొగ్గుల దస్తగిరి దశ దిశ మారేనా..:** నియోజకవర్గంలోని పసుపల గ్రామ సర్పంచ్ బొగ్గుల సుశీలమ్మ కుమారుడైన బొగ్గుల దస్తగిరి తెలుగుదేశం పార్టీలో యువ నాయకులుగా కొనసాగుతున్నారు. టిడిపి సీనియర్ నాయకులైన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో తన రాజకీయ భవిశ్యత్తుపై ఆశలు పెంచు కొన్నారు. చురుకుతనం, మితభాషి, విధ్యావంతుడు, అందరినీ ఆకట్టుకొనే స్వబావం కల్గిన దస్తగిరి తన ప్రయతమ నాయకుడైన ఎదురూరు విష్ణు ఆశీస్సులుతో పార్టి అధిష్టానం అవకాశమిస్తే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టి అభ్యర్థిగా తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసుకొనేందుకు ఆరాటపడుతున్నారు. గ్రామాలలోని ప్రజలను కలుస్తూ వైసిపి అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తున్నారు. వైసిపిలో విభేదాలతో నలుగుతున్న కార్యకర్తలనుసైతం బొగ్గుల టిడిపి ముగ్గులోకి దించుతున్నారు. పార్టి ఎప్పుడు ఆదేశించినా ఫలితం ఆశించకుండా పనిచేసి పెట్టడమే తెలిసిన ఎదురూరు విష్ణు నిర్ణయించిన వారినే అధిష్టానం రానున్న ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ జరిపిన పలు సర్వేలల్లో బొగ్గుల దస్తగిరి పేరు ముందంజలో ఉందని, రానున్న ఎన్నికల్లో విష్ణు వర్గీయుడైన బొగ్గుల దస్తగిరి దశ దిశా మారి రాజకీయ మహర్ధశ పట్టనుందని రాజకీయవర్గాల బోగట్టా.

**నేశపోగు కిరణ్‌మై కిరణంలా దూసుకొచ్చేనా..:** కర్నూలు పట్టణం ఎర్రబురుజుకు చెందిన నేశపోగు కిరణ్‌మై టిడిపి రాష్ట్ర యస్‌సిసెల్ ఆర్గనైజర్ సెక్రెట్రీ గాకొనసాగుతున్నారు. భర్త పాటెల్ జయకృష్ణ కర్నూలు టిడిపి మాజీ అద్యక్షులుగా పనిచేశారు. అంతేగాకుండా కిరణ్‌మై తండ్రి నేశపోగు హనుమంతరావు గతంలో టిడిపి నాయకుడి పనిచేసి కోడుమూరు అసెంబ్లీ టికెట్ ఆశించారు. ఇలా మొత్తం టిడిపిలో పనిచేయడంవల్ల టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో గల సంబందాలవల్ల రానున్న ఎన్నికల్లో అభ్యర్థిగా అధిష్టానం తనపేరునే ప్రకటిస్తోందని దీమాతో ఉన్నారు. నియోజకవర్గంలోని పార్టికి దూరమైన కార్యకర్తలను కలిసి పార్టికి పూర్వవైభవం తీసుకురావాలంటున్నారు. తమ ప్రియతమ నాయకుడైన చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు వివరిస్తున్నారు. నియోజకవర్గంలో పలుసేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ దూసుకెల్తున్నారు. పలు వ్యాపారసంస్థలు కలిగి ఆర్థికంగా స్థిరపడిపోయిన కిరణ్‌మై ప్రజలకు సేవ చెయ్యాలనే లక్ష్యంతోనే ముందుకువస్తున్నారు. పార్టీ అధిష్టానం రానున్న ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే కిరణ్‌మై కిరణంలా దూసుకొస్తుందని,తెలుగుదేశం చరిత్రను యిక్కడ తిరగరాస్తుందని పలువురు వాపోతున్నారు.

**ఆకెపోగు ప్రభాకర్ ప్రభావం తేలేనా..:** నియోజకవర్గంలోని గుడూరు నివాసి అయిన ఆకెపోగు ప్రభాకర్ అంటే రాజకీయవర్గాల్లోని వారందరికీ సుపరిచితుడు. యవ్వనదశనుండే తెలుగుదేశంపార్టిలో అలుపెరగని కార్యకర్తలా పనిచేశారు. టిడిపి నియోజకవర్గం ఇంచార్జీగా పనిచేస్తూ ప్రతికార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. గతంలో గుడూరు సర్పంచ్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ శిఖామణికి తెలుగుదేశం పార్టి అభ్యర్థిగా గట్టి పోటీనిచ్చారు. అధిష్టానానికి తన ప్రభావం,పార్టీకోసం కష్టపడ్డ విధానం తెల్సని రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా తనపేరును ప్రకటిస్తుందని విజయం సాదించి తన ప్రభావానికి తిరుగులేదని తేల్చేస్తా అని అంటున్నారు.

వీరుగాక మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్టుకోసం అధిష్టానం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి పార్టిపట్ల ప్రజల్లో గల వ్యతిరేకత, ప్రభుత్వం,ప్రవేటు ఉద్యోగుల్లో గల అసంతృప్తి కారణంగా తెలుగుదేశంపార్టిలో టికెట్ సాదిస్తేచాలు గెలుపు మనదేనన్న దీమాతో పలువురు ఆశావాహులు ముందుకొస్తున్నారు. రాష్టంలోజనసేనా,బిజెపి పొత్తుల విషయంలో గల సందిగ్ధం కారణంగా టిడిపి లోగల టికెట్‌వార్ తారాస్థాయికి చేరుకొంది. పొత్తుల విషయం తేలిపోయి త్వరలోనే టిడిపిలో టికెట్‌వార్‌కు ముగింపుకార్డు పడనుంది.

# వాలంటీర్ల సేవలు అమోఘం..

## కరోనా సమయంలో వారు అందించిన సేవలు మరువలేనివి

## వైసీపీ ఇంఛార్జీ విరుపాక్షి

**ఆలూరు, మేజర్‌న్యూస్ :.** రాష్ట్రంలో వాలంటీర్ల సేవలు అమోఘమని కరోన సమయంలో వారు చేసిన సేవలు మారువలేనివని అందుకే ప్రభుత్వం వారికి సేవారత్న,సేవా మిత్ర,సేవా వజ్ర పురస్కారాలు అందిస్తుందని ఆలూరు వైసీపీ ఇంచార్జ్ విరుపాక్షి అన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్

గురువారం మండల పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రతి నెల 1వతేది వచ్చిన వెంటనే ఉదయాన్నే వృద్ధులకు,వితంతులకు,వికలాంగులకు పెన్షన్ లు అందచేస్తున్నారని అన్నారు.అలాగే గ్రామంలో ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన సేవలు చేస్తున్నారని ప్రతి ఒక్కరు మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లో సచివాలయంలో పనులు చేసి పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఏరూరు శేఖర్,ఎంపిపి రంగమ్మ, వైస్ ఎంపిపి శ్రీరాములు, నాగవేణి శ్రీధర్, చిన్న ఈరన్న, ఎంపిటిసి లు, సర్పంచ్‌లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

## : మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి


మాట్లాడుతున్న గౌరు చరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** టీడీపీ అధికారంలోకి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గౌరుచరితారెడ్డి, అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి సమక్షంలో వార్డులో పలువురు శివ, లక్ష్మినారాయణ, సీతరామ్, మధు, రామయ్య, హరిప్రసాద్, కిరణ్‌కుమార్, మధుబాబు, బాష, శివుడు, పుష్పలత, దేవమ్మ, వారి అనుచరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్వతమ్మ, రామక్రిష్ణ, ప్రభాకర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్యగౌడ్, శ్రీనివాసరావు, జవ్వాజి గంగాధర్‌గౌడ, కేతూరు మధు, కురువ ధనుంజయ, జగదీష్‌రెడ్డి, పవన్‌కుమార్, జనసేన పార్టీ వార్డు నాయకుడు షబ్బీర్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా చౌడేశ్వరిదేవి గుమ్మటోత్సవం

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** కోడుమూరు పట్టణంలో వెలసిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి గుమ్మటోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారి కలశానికి దేవాలయంలో పూజలు చేసి, మాడవీధుల గుండా ఊరేగించి, అమ్మవారి కలశాన్ని రథంపై ఏర్పాటుచేసి ఘనంగా గుమ్మటోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం బ్రహ్మోత్సవం, శనివారం నంది ధ్వజశావ, మాఘ కృష్ణ పాడ్యమి ఆదివారం రోజున రథోత్సవం సోమవారం తిరుగురథోత్సవం మంగళవారం పారువేట బుధవారం వసంతోత్సవం జరపనున్నట్లు ఆటగార దేవాంగ దైవాచార



సంఘం నాయకులు తెలిపారు. శ్రీ చౌడేశ్వరి దేవి తిరుణాల సందర్భంగా ఆదివారం న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలు బాలబాలికల ముద్దుపాపల పోటీలు నిర్వహిస్తున్నట్లు సోమశేఖర్ యాదవ్ తెలిపారు. సంవత్సరం రెండు సంవత్సరాలు గల బాల బాలికల ముద్దు పోటీలలో గెలపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వ నున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులతో భరతనాట్యం, కూచిపూడి, మరియు 15 సంవత్సరముల బాలబాలికలకు పాటల పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## ధృవీకరణ పత్రాలపై

# అవగాహన సదస్సు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** ధృవీకరణ పత్రాలపై ఎదురయ్యే సమస్యలపై గురువారం నగరంలోని జిల్లా కోర్టులోని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకటనాగశ్రీనివాసరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీడీవోలు జయశ్రీ, దివ్యలు అవగాహన కల్పించారు. జనన, మరణ, వివాహం, ఆదాయం, కులం ధృవీకరణ పత్రాలకు ఎలాంటి పత్రాలు అందజేయాలని, ఏ విధంగా పొందాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్.వెంకటనాగశ్రీనివాసరావు

# హమాలీ కార్మికునికి ఆర్థికసాయం

**కోడుమూరు, మేజర్ న్యూస్:** కోడుమూరు పట్టణంలో హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నటువంటి సుంకన్నకు గురువారం హమాలి సంఘం ఆర్థిక సహాయాన్ని అందించింది. లోడింగ్ అన్ లోడింగ్ పనులలో భాగంగా హమాలి కార్మికుడైన సుంకన్నకు ఇటీవలే ప్రమాదం సంభవించింది. హమాలి సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న సుంకన్న ఈ ప్రమాదం నుండి కోలుకోవడానికి దాదాపుగా ఆరు నెలల సమయం పడుతుందని వైద్యులు నిర్ధారించారు. ఖర్చుల నిమిత్తం హమాలీ కార్మికులందరూ కలిసి తమ వంతు సహాయంగా 5000 రూపాయలను జమచేసి అందజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి రాజు, ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు, పాటుగా హమాలి సంఘం నాయకులు మద్దిలేటి, ఏడుకొండలు, బజారి, శివుడు, మధు, రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# డోన్ సెగ్మెంట్లో సైకిల్ సవారీ..

(మొదటిపేజీ తరువాయి)

అధికార వైసిపి ఏకచిత్రాధిపత్యం కొనసాగించింది. అప్పటికే చుక్కాని లేని నావలా ఉన్న టిడిపిని ఒక గాడిలో పెట్టేందుకు చంద్రబాబు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. టిడిపి బాధ్యతలు అప్పగించడం కోసం కోట్ల ,కేఈ కుటుంబాలను పలుమార్లు సంప్రదించినప్పటికి ఆ రెండు కుటుంబాలు డోన్ నుంచి పోటీ చేసేందుకు అప్పట్లో విముఖత చూపించినట్టు విశ్వసనీయ సమాచారం .ఎట్టి పరిస్థితుల్లో బుగ్గనను ఓడించి తీరాలన్న దృఢ సంకల్పంతో ఉన్న చంద్రబాబు ప్రత్యామ్నాయ మార్గం వైపు అడుగులు వేశారు.నియోజక వర్గ రాజకీయాలపై స్పష్టమైన అవగాహన కలిగి, నియోజకవర్గంలో తనకంటూ ఒక మంచి పట్టు ఉన్న టిడిపి ద్వితీయ శ్రేణి నాయకుడు ధర్మారం సుబ్బారెడ్డిని టిడిపి ఇన్చార్జిగా ప్రకటించారు చంద్రబాబు. సుబ్బారెడ్డి ఇంచార్జ్ గా బాధ్యతలు తీసుకున్న వెనువెంటనే వచ్చిన బుగ్గన సొంత ఊరు బేతంచర్ల మున్సిపల్ ఎన్నికలలో టిడిపి మంచి విజయాన్ని అందుకుంది. బేతంచర్ల పంచాయతీ ఎన్నికల్లో బుగ్గన కుటుంబానికి ప్రత్యర్థిగా ఎవరు పోటీ చేసినా మూడు వార్డులు కూడా గెలవలేని చోట ఆరు సీట్లలో తెదేపా అభ్యర్థులను గెలిపించి బుగ్గన కంచుకోట ను బద్దలు కొడతామనే హెచ్చరికలు జారీచేశారు. అంతేకాకుండా పార్టీని క్షేత్ర స్థాయి నుంచి ఒక ప్రణాళిక ప్రకారం బలోపేతం చేసుకుంటూ వచ్చాడు ధర్మారం సుబ్బారెడ్డి. వీటన్నిటిని నిశితంగా గమనించిన టిడిపి అధిష్టానం బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా డోన్ పర్యటనలో టిడిపి అదినేత చంద్రబాబు ఇక్కడ మన అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డే నని తేల్చి చెప్పారు .టిడిపి సాంప్రదాయ ధోరణికి భిన్నంగా రెండు సంవత్సరాల ముందుగానే రాష్ట్రంలోనే మొదటి అభ్యర్థిగా ధర్మారం సుబ్బారెడ్డిని ప్రకటించడం అప్పట్లో తీవ్ర చర్చనీయంశంగా మారింది సాంప్రదాయ రాజకీయాలకు టిడిపిలో తావు లేదని కష్టపడే వారికే టికెట్లు ఇస్తామని ఈ ప్రకటన ద్వారా చంద్రబాబు తేల్చి చెప్పారు. అంతే కాకుండా నియోజక వర్గంలో జరిగిన బాబు,లోకేష్ పర్యటనల ను విజయవంతం చేయడంలో సుబ్బారెడ్డి సక్సెస్ అయ్యాడని చెప్పవచ్చు. ఒక వైపు పార్టీని తనదైన శైలిలో బలోపేతం చేస్తూ, మరోవైపు ప్రత్యర్థి బుగ్గన వైఫల్యాలను, వైసిపి నాయకుల అవినీతి అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ముందుకు సాగిన ధర్మారం సుబ్బారెడ్డి సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైన వేళ మరింతగా దూకుడు పెంచాడు. అధినేత చంద్రబాబు తనపై పెట్టుకున్న నమ్మకానికి ఎక్కడా తగ్గకుండా కార్యకర్తల కష్టానికి కొండంత అండగా ఉంటూ భరోసా ఇచ్చారు. కష్టకాలంలో కాడెతుకున్న ధర్మారం సుబ్బారెడ్డి డోన్ టిడిపి సంక్షోభంలో ఉందా అనే స్థాయి నుంచి సమరానికి సై అంటే సై అనే స్థాయి వరకు తీసుకురావడంలో మాత్రం సక్సెస్ అయ్యారన్నది మాత్రం సుస్పష్టం.

### క్యాడర్‌కు అండగా లీడర్

డోన్ టిడిపి ఇంచార్జ్ గా బాధ్యతలు తీసుకున్న ధర్మారం సుబ్బారెడ్డి మొదటి నుంచి కార్యకర్తలకు అండగా ఉంటూ వస్తున్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ మోపుతున్న అక్రమ కేసులపై ఎప్పటికప్పుడు తన నిరసన గళాన్ని వినిపిస్తూ క్యాడర్ కు అండగా నిలుస్తూ వచ్చారు. అంతేకాకుండా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే క్రమంలో కష్టపడ్డ వారికే అనుబంధం విభాగాలలో అవకాశం కల్పించి వారిని నాయకులుగా తీర్చి దిద్దుతున్నారు .రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడ్డ ఏ ఒక్క కార్యకర్తకు కూడా అన్యాయం జరగదని ,తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రతి ఒక్క కార్యకర్త కూడా ఎమ్మెల్యేనే అంటూ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. టిడిపి అధిష్టానం ఆదేశించిన పార్టీ కార్యక్రమాలు అయినటువంటి బాదుడే బాదుడు, ఇదేం కర్మ తదితర కార్యక్రమాలలో పార్టీ శ్రేణులను భాగస్వాములను చేస్తూ దిగ్విజయంగా పూర్తి చేసిన సుబ్బారెడ్డి చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టోని బాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ ఇంటింటి ప్రచారం ద్వారా ప్రజల్లోకి మరింత ముమ్మరంగా తీసుకెళు తున్నారు. అంతేకాకుండా ఓటరు జాబితా పై బూత్ ఇన్చార్జిలకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ ,వాటిని పర్యవేక్షిస్తూ ఎన్నికలకు క్యాడర్ ను సమాయత్తం చేస్తున్నారు.

### మలుపులెన్నున్నా గెలుపు నాదే..

ఎన్నికల ముంచుకొస్తున్న వేళ రాజకీయ చదరంగంలో ఎవరికి వారు తమ ఎత్తులు ఎత్తుల కు పై ఎత్తులు వేస్తూ పావులు కదపడం పరిపాటే. అది ప్రత్యర్థులైనా, సొంత పార్టీ నేతలైనా సరే .అందులో భాగంగానే డోన్ టిడిపి అభ్యర్థిత్వంపై కూడా సరికొత్త వాదనలు, ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఇదే అదునుగా చేసుకున్న అధికార పార్టీ వైసీపీలో నుంచి టిడిపిలోకి వలసలను నివారించాలనే ఉద్దేశంతో టిడిపిలో అస్తిత్వం నెలకొల్పేందుకు తన రహస్య మిత్రుల ద్వారా ఆ


బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇంఛార్జీ సుబ్బారెడ్డి

ప్రచారాలకు మరింత ఆజ్యం పోస్తుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. అయితే అలాంటి ప్రచారాలలో కొన్ని టీ కప్పులో తుఫాన్ మాదిరిగానే సమిసిపోగా మరికొన్ని ప్రచారాలకు త్వరలోనే తెరపడుతుందని చెప్పుకొస్తున్నాడు ధర్మారం సుబ్బారెడ్డి .టిడిపి అధినేత చంద్రబాబు మాటపై తనకు నమ్మకం ఉందని డోన్ నియోజకవర్గ టిడిపి కార్యకర్తల అండదండలు, ప్రజల ఆశీసులు తనకు ఉన్నంతసేపు ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, కథ ఎన్ని మలుపులు తిరిగినా గెలుపు మాత్రం తనదేనని డోన్ లో టిడిపి జెండా ఎగరవేసి తమ అధినేత చంద్రబాబుకు కు బహుమతిగా అందజేస్తామని దీమా వ్యక్తం చేస్తున్నాడు సుబ్బారెడ్డి. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా గెలుపు ఓటములపై పలు సర్వే సంస్థలు నిర్వహించిన సర్వేలలో కూడా డోన్ లో టిడిపి కే విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్న వార్తలతో తెలుగు తమ్ముళ్లు రెట్టింపు ఉత్సాహంతో ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

సూర్య

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

# ఆర్యవైశ్యులు కులంగా కాకుండా కుటుంబంగా ముందుకు సాగాలి

**– ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకుంటాం**
**–మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**



టీజీ వెంకటేష్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్యులు అంటే ఒక కులంగా కాకుండా కుటుంబంగా భావించే విధంగా ముందుకు సాగాలని రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పిలుపునిచ్చారు. నగరంలోని హోట ల్ మౌర్య ఇన్ విభులో టీజీ వెంకటేష్ దంపతులు వివాహ వార్షికోత్స వాన్ని పురస్కరించుకొని ఆవోపా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో టీజీ వెంకటేష్ దంపతులు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్త, కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్‌తోపాటు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య మహాసభ, ఆవోపా సంస్థలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడు తూ ఈ కార్యక్రమాన్ని ఇక నుంచి నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఏడాది మే 16న తన పుట్టినరోజు సం దర్భంగా గత 30ఏళ్లు కులమతాలకు అతీతంగా సామూహిక వివాహా లు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా జరిగి ఉండదన్నారు. ఆర్యవైశ్యులకు సంబంధించి రాజ్యాపరంగా ఎలా ంటి హక్కులు లేవని, ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయ, సహకారా లు అందడం లేదన్నారు. ఆర్యవైశ్యులు ఎక్కడ ఉన్నా, ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకునే దిశగా ముందుకు వెళ్తామన్నారు. యువత పారిశ్రామికవేత్త టీజీ భరత్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ప్రతి సంవత్సరం ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంత రం టీజీ వెంకటేష్ దంపతులను ఘనంగా సన్మానించారు.

# క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్



పతకాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా తరపున ఆడుదా ం-ఆంధ్ర క్రీడల్లో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీ ల్లో రెండు, మూడు స్థానాలను సాధించిన క్రీడాకారులను, నేతృ త్వం వహించిన డీఎస్‌డీవో శ్రీని వాసరావును జిల్లా కలెక్టర్ జి.సృ జన అభినందించారు. గురువా రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి లో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో బాలికలు వాలీబాల్ క్రీడలలో రాష్ట్రంలో రెండవ స్థానం, షటిల్ బ్యాడ్మినంట్‌లో 3వ స్థానం, బాలురు కబడ్డీ పోటీల్లో 3వ స్థానంలో నిలిచారు. వారు సాధి ంచిన ట్రోఫీలు,మెడల్స్,సర్టిపికెట్లను పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మన జీవితం లో ఎల్లప్పుడూ భాగమై ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో సెట్కూరు సీఈవోరమణ పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ కోసం కాంగ్రెస్ ఛలో సెక్రటేరియట్

**ఛలో విజయవాడ సచివాలయం ముట్టడిని భగ్నం చేసిన పోలీసులు**
**లక్ష్మీ నరసింహ యాదవ్ ను అరెస్ట్ చేసిన విజయవాడ పోలీసులు..**



లక్ష్మీ నరసింహయాదవ్‌ను అరెస్టు చేస్తున్న దృశ్యం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** మెగా డీఎస్సీ కోసం ఏపీ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో సెక్రటేరియట్ విజ యవాడలో ఉద్రిక్తతకు దారితీసిం ది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు గురువార ం ఉదయం విజయవాడ చలో సచివాలయం ముట్టడి కార్యక్రమ ంలో నంద్యాల పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ కార్యాలయం సమీపంలో లక్ష్మి నరసింహ యాదవ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకొని చలో సచివాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్లనివ్వకుండ పోలీసులుఅరెస్ట్ చేయడం హేయమైన చర్యగా లక్ష్మి నరసిం హ యాదవ్ పేర్కొన్నారు. మహానేత వైఎస్ఆర్ 52 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తే.. వారసుడుగా చెప్పుకొనే జగన్ అన్న 6 వేలతో "దగా డీఎస్సీ"వేశాడు అన్నారు .2019 ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు 25 వేల టీచర్ పోస్టుల భర్తీ ఎక్కడ..? అని ప్రశ్నించారు. 5 ఏళ్లు నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన ఎందుకుచేశారని,ఎన్నికలకు నెలన్నర ముం దు 6 వేల పోస్టుల భర్తీ చేయడంలో ఆంతర్యం ఏమిటని,టెట్,డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు దేనికి ప్రిపేర్ అవ్వాలని ప్రశ్నించారు. నోటిఫికేషన్ ఇచ్చిన 30 రోజుల్లో పరీక్షలు పెట్టడం దేశంలో ఎక్కడైనా ఉందా అన్నారు,టెట్ కి 20 రోజులు,తర్వాత డీఎస్సీ మధ్య కేవలం 6 రోజుల వ్యవదేనా ప్రసించరు.రోజుకి 5 పుస్తకాలు చదవడం అభ్యర్థులకు సాధ్యపడే పనేనా అని ప్రశ్నించారు.మానసిక ఒత్తిడికి గురిచేసి నిరుద్యోగులను పొట్టన పెట్టుకోవాలని కుట్ర చేస్తున్నారని ఇది కక్ష్య సాధింపు చర్య కాదా అని ప్రశ్నించారు.నవ రత్నాలు,జాతి రత్నాలు అని చెప్పుకొనే జగన్ ఆయన చుట్టూ ఉండే సకలం శాఖ మం త్రులు ఈ ప్రశ్నలకు దమ్ముంటే సమాధానం చెప్పాలి అని లక్ష్మి నరసింహ యాదవ్ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు బరగోడ్ల హుస్సేన్ బాష, రాష్ట్ర మైనారిటీ సెక్రెటరీ శంసుల్ హాక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్, వడ్డే సాంబశివుడు, నజీర్ బాష, మహబూబ్ బాష, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలోనే పేదల జీవితాల్లో సూర్యోదయం

**- 3081 మందికి 4664 ఎకరాలు సంపూర్ణ భుహక్కు పత్రాలు పంపిణీ చేశాం- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన**
**- రూ.60లక్షలతో వెజిటబుల్ మార్కెట్ యార్డు ప్రారంభం**

**బేతంచెర్ల ,మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో పేద ప్రజల జీవితాల్లో సూర్యోదయం మొదలైందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో రూ.60లక్షలతో నిర్మించి న వెజిటేబుల్ కూరగాయల మార్కెట్ యార్డును ఆర్థిక శాఖ మంత్రి ప్రారంభించారు.అనంతరం సమావేశంలోమాట్లాడుతూ ముఖ్యమం త్రి వైస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో కుల మతాలు చూడకుండా పారదర్శకంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ,ఓసిలవర్గాలన్నింటికీ మేలు చేశామనిఅన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ యార్డ్ నిర్మించడంతో వ్యాపారధారుల కష్టాలు తీర్చమని అన్నారు. త్వరలోనే వాటర్ గ్రిడ్జ్ పథకం కింద బేతంచెర్లకు ప్రతి ఇంటికి కృష్ణ జలాలు వస్తాయని అన్నారు. మండలంలో జగనన్న భూ శాశ్వత హక్కు భూ రక్ష పథకం క్రింద ముద్దవరం, ఎం పెండకల్, ఆర్ఎస్ రంగాపురం, గోరుమానకొండ, బుగ్గానపల్లి, గొర్లగుట్ట, ఎంబాయ్, కొలుములపల్లె,గుటుపల్లె,ఆర్ కొత్తపల్లె,బేతంచెర్ల గ్రామాలలోని 20 ఏళ్లకు పైగా అనుభవంలో ఉన్న రైతుల డీ పట్టా భూములు,చుక్కల భూములకు సుమారు 3081 మంది రైతులకు 4664 ఎకరాలకు సంపూర్ణ భూహక్కు పత్రాలను పంపిణీ చేశామని తెలిపారు.బాబు ష్యురిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ పథకం బూటకమని ,బాబుకే గ్యారెం టీ లేనప్పుడు పథకాలు ఎక్కడని,గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలీకే దిక్కు లేదని విమర్శించారు. డోన్ టిడిపి ఇంచార్జి హోదాలో ధర్మ వరం సుబ్బారెడ్డి తమ సొంత నిర్ణయంగా పేద ప్రజలకు సెంటు న్నార స్థలం ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారని,పట్టణంలోని సుమారు 12 వేల రేషన్ కార్డులు ఉండగా వారికి ఇవ్వాలన్న 300 ఎకరాలు ఎక్కడ ఎలా ఇస్తారో చెప్పాలని ,ఎకరా కనీసం రూ.కోటి వేసుకున్న రూ. 300 కోట్లు ఖర్చు పెడతారా అని విమర్శించారు. ఆర్థికమంత్రి ఓడిపోతామని ప్రారంభలు చేస్తున్నారని విమర్శించే ప్రతిపక్ష నాయకుడు నాపై పోటీ చేయడానికి ముందు టికెట్ తెచ్చు కోవాలని ఎద్దేవాచేశారు.ప్రజల ఆశీర్వాదంతోనే డోన్ నియోజకవ ర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేశామని అన్నారు. ప్రజాలకుమేలు చేసివుంటేనే ఓటేయమని అడిగిన ముఖ్యమంత్రి దేశంలోవై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కరే అని అన్నారు.ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి,గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ బాబురెడ్డి, మద్దిలే టిస్వామి ఆలయ చైర్మెన్ బి.సీత రామచంద్రుడు, మైనారిటీ కార్పొరే షన్,ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజవాలి,ఖాజా హుస్సేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రమేష్ బాబు,డిప్యూటీతహశీల్దార్ సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవి,కౌన్సిలర్లు ,అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇంతకీ.. ! ఎవరీ సూర్యనారాయణరెడ్డి

**– జగనన్న సురక్ష ఆయనకే .. జగనన్న ఆరోగ్య సురక్ష అతనికే**
**– అత్యవసర పనులూ – పల్లెకు పోదాం– ఆడుదాం ఆంధ్రా సైతం**
**– నాలుగు నెలల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** పొరుగు నియోజకవర్గా నికి చెందిన కాంట్రాక్టర్ నంద్యాల మున్సిపాలిటిలో ప్రభు త్వ కార్యక్రమాలన్నీ నిర్వహించారు. గడచిన నాలుగు నెల ల్లో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష , జగనన్న ఆరోగ్య సురక్ష , పల్లెకు పోదాం, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలన్నీ కాంట్రాక్టర్ సూర్యనారాయ ణరెడ్డి నిర్వహణలోనే జరిగా యి.నంద్యాల మున్సిపాలిటిలో అత్యవసర పనులను ఆయ నతో చేయించారు. నంద్యాల మున్సిపాలిటిలో రిజిస్టర్ కాంట్రాక్టర్లు ఎందరో ఉన్నా వారందరినీ కాదని అధికార యంత్రాంగం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ ఆయనకు అప్పగించింది. కోవిడ్ సమయంలో నంద్యాల మున్సిపాలి టిలో కాంట్రాక్టర్‌గా వచ్చిన సూర్యనారాయణరెడ్డి ప్రారం భంలో టెండర్ కాంట్రాక్ట్ పనుల్లో భాగస్వామ్యం అవుతూ వచ్చారు. కమిషనర్ , మున్సిపల్ చైర్ పర్సన్ పర్యటన సమయంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అత్య వసరంగా చేపట్టిన పనులను అప్పగించడం జరుగుతూ వచ్చింది. గడచిన నాలుగు నెలల్లోనే రూ. లక్షల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ చేపట్టారు. కాంట్రాక్టర్ సూర్యనా రాయ ణరెడ్డికి జనరల్ ఫండ్ నుంచి నిధుల చెల్లింపు వివా దాస్పదంగా మారింది. మున్సిపల్ కౌన్సిల్ అనుమతి లేకుం



నంద్యాల మున్సిపాలిటి

డా రూ. లక్షల్లో నిధులు చెల్లింపులు జరిగాయి. ప్రస్తుతం నంద్యాల మున్సిపాలిటిలో కాంట్రాక్టర్ సూర్యనారాయణరె డ్డి అటూ కాంట్రాక్టర్లకు, ఇటు అధికార యంత్రాంగంతో పాటు అధికార పార్టీ నాయకులకు కేంద్ర బింధువుగా మారారు. ఒక కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణతోపాటు అత్యవసర పనులను అప్పగించడం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..

నంద్యాల మున్సిపాలిటిలో పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు ఉన్నారు. నంద్యాల మున్సిపాలిటిని నమ్ముకొని 30నుంచి 20 సంవత్సరాల నుంచి కొందరు కాంట్రాక్టర్లు పొరుగు నియోజకవర్గాల నుంచి వచ్చి నంద్యాలలో స్థిరపడ్డారు. మున్సిపల్ అభివృద్ధి పనుల టెండర్లలో పాల్గొంటూ వస్తు న్నారు. నంద్యాల మున్సిపల్ కాంట్రాక్టర్లకు రూ. కోట్లల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనుల నిధులు మంజూరు కాకాపోవడంతో కాంట్రాక్టర్లు టెండర్ పనులను చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. మున్సిపల్ ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్ళు పెరిగినప్పుడు అధికా ర యంత్రాంగం కాంట్రాక్టర్లను పిలిపించుకొని పనులు చేపట్టేలా ఒప్పించే ప్రయత్నం చేసిన ఘటనలు లేకపోలే దు. చేసిన అభివృద్ధి పనులకు సిఎంఎఫ్ఎస్ పూర్తయినా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడం అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారుతూ వచ్చిం ది. చివరకు రూ. 20 వేల అత్యవసర పనులను చేపట్టేం దుకు ముందుకు రాని పరిస్థితులు తలెత్తుతూ వచ్చాయి. నంద్యాల మున్సిపాలిటిలో రఘునాథ్ నాయుడు, లక్ష్మ య్య, కృష్ణ, నాగరాజు, రామ సుబ్బారెడ్డి, షేక్ షావలిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, సందీప్, రమేష్ నాయు డు, సత్యం, రాముతోపాటు పి వెంకట రామిరెడ్డి తదితర రిజిస్టర్ కాంట్రాక్టర్లు ఎన్నో ఏళ్ళ నుంచి నంద్యాల అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతూ వచ్చారు. ఇదంతా నాణెనికి ఒక వైపు అయితే సరిగ్గా కోవిడ్ సమ యంలో పొరుగు నియోజకవర్గం నుంచి కాంట్రాక్టర్ సూర్యనారా యణరెడ్డి నంద్యాల మున్సిపాలిటికి వచ్చారు. ప్రారంభం లో అందరూ కాంట్రాక్టర్లతోపాటు టెండరు ప్రక్రియలో పాల్గొంటూ వచ్చారు. ప్రధానంగా పైపులైన్ పనులతోపాటు ఇతర పనులను చేస్తూ వచ్చారు. గడచిన ఏడాదిన్నర నుంచి నంద్యాల మున్సిపాలిటిలో అత్యవసర పనులకు సూర్యనారాయణరెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. అధికార యంత్రాంగం అప్పగించిన అత్యవసర పనులను చేపడు తూ వచ్చారు. ప్రధానంగా పబ్లిక్ హెల్త్ విభాగంతో పాటు ఇంజనీరింగ్ విభాగంలో అత్యవసర పనులను పెద్ద సంఖ్య లో చేశారు. తాజాగా నాలుగు నెలల్లో ప్రభుత్వం జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రతిష్టాత్మ కంగా నిర్వహించింది. గత రెండు నెలల్లో పల్లెకు పోదాం, వార్డుకు పోదాం, ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలను నిర్వహించింది. ప్రధానమైన నాలుగు కార్యక్రమాలను కాం ట్రాక్టర్ సూర్యనారాయణరెడ్డి నిర్వ హించారు. నంద్యాల మున్సిపాలిటిలో అంత మంది కాం ట్రాక్టర్లు ఉన్నా అన్ని అత్యవసర పనులతోపాటు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహ ణ బాధ్యతలను అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అయి న వ్యయాన్ని మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లింపు లు జరపడాన్ని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తు న్నారు. నాలుగు నెలల నుంచి ఆయనకు రూ.లక్షల్లో చెల్లిం పులు జరిగాయి. ఇంకా ఆయనకు రూ. లక్షల్లోనే చెల్లింపు లు జరపాల్సి ఉంది. సాధారణ నిధుల చెల్లింపుల అంశం అధికార పార్టీకి చెందిన కీలక ద్వితీయ శ్రేణి నాయకుడు ఒకరు నంద్యాల అధికార పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్ళడంతో గత కమిషనర్ రవిచంద్రారెడ్డిపై బదిలీ వేటు పడిందని ప్రచారం సాగుతుంది. గత కమిషనర్ రవిచం ద్రారెడ్డి ఆదేశాల మేరకే అత్యవసర పనులతోపాటు ప్రభు త్వ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను అధికార యం త్రాంగం అప్పగించిం దని విశ్వసనీయంగా తెలుస్తోంది. మరి రాబోయే రోజుల్లో సాధారణ నిధుల చెల్లింపు ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.